క్లుప్తంగా

సీజనల్ వ్యాధులతో ముప్పు

చీరాల టౌన్: గ్రామీణ ప్రాంతాల్లోని వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని పీహెచ్‌సీ వైద్యులు శ్రీదేవి వెల్లడించారు. శుక్రవారం ఈపురుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. పీహెచ్‌సీ పరిధిలోని 14 సబ్ సెంటర్లలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. గ్రామాల్లోని చిన్నపిల్లలు, వృద్ధులు అనారోగ్యానికి గురికాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. చిన్నపిల్లలకు, గర్భిణులకు తప్పనిసరిగా వ్యాక్సిన్లు వేయాలన్నారు. పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎయిడెడ్ పరీక్షకు హాల్‌టికెట్లు

ఒంగోలు సిటీ: ఉమ్మడి ప్రకాశం జిల్లా బల్లికురవ మండలం వల్లపల్లి గ్రామంలోని సీఏ అప్పర్ ప్రైమరీ స్కూల్లో ఖాళీగా ఉన్న ఎస్జీటీ ఎయిడెడ్ పోస్టు భర్తీ చేయనున్నారు. దీని కోసం ఈ నెల 27వ తేదీ నిర్వహించే పరీక్షకు దరఖాస్తు చేసిన అభ్యర్థులు అప్లికేషన్ ఐడీ, పుట్టిన తేదీని సీఎస్‌ఈ పోర్టల్‌లో సమర్పించి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని డీఈఓ కిరణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నరసరావుపేట ఇంజినీరింగ్ కాలేజీ అటానమస్ బ్లాక్–4లో నిర్వహించే పరీక్ష కేంద్రాల్లో ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు రెండో సెషన్ జరుగుతుందన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరూ పరీక్ష కేంద్రానికి హాల్‌టికెట్లతో పాటు ఏదైనా గుర్తింపు కలిగిన ధ్రువపత్రంతో గంట ముందుగా హాజరు కావాలని కోరారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

అద్దంకి: విద్యాభివృద్ధిలో భాగంగా పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి శుక్రవారం ముండ్లమూరులోని పాఠశాలలో రూ.5వేల విలువ చేసే పుస్తకాలను అందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కారును ఢీ కొన్న లారీ



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

మేదరమెట్ల: పౌడర్ లోడుతో దాక్షపల్లి నుంచి చెన్నైకు వెళుతున్న లారీ వెనుక టైరు వీల్‌బోల్ట్ విరిగిపోవడంతో అదుపు తప్పి డివైడర్ ఎక్కి పక్కరోడ్డుపైకి వెళ్లిన సంఘటన కొరిశపాడు మండలం మేదరమెట్ల దక్షిణబైపాస్ సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. ప్రమాదంలో పక్క రోడ్డులో వెళుతున్న డస్టర్ కారును ఢీ కొంది. దీంతో కారు పాక్షికంగా దెబ్బతింది. అదృష్టవశాత్తు కారులోని వారికి ఎలాంటి ప్రమాదం వాటిల్లలేదు. మేదరమెట్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నేడు ప్రగడ కోటయ్య 111వ జయంతి

చీరాల: ప్రజాబంధు ప్రగడ కోటయ్య 111 వ జయంతి సందర్భంగా శనివారం చీరాలలోని ప్రగడ కోటయ్య కాంస్య విగ్రహం వద్ద ఉదయం 10గంటలకు బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు ఆహ్వాన కమిటీ ప్రతినిధులు శుక్రవారం తెలిపారు. ప్రగడ కోటయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం సభ జరుగుతుందని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మూలనపడిన జనరేటర్లు

- తహసీల్దార్ కార్యాలయంలో నిరుపయోగంగా ఉన్న వైనం
- విద్యుత్ అంతరాయమప్పుడు విధులకు ఆటంకం కలగకుండా చేసే అవకాశం
- ప్రకృతి విపత్తుల సమయంలో ఉపయోగంచేలా ఒకటి..
- రికార్డుల కంప్యూటరీకరణకు మరొకటి..
- మరమ్మతుల గురించి పట్టించుకోని అధికారులు



చినగంజాం తహసీల్దార్ కార్యాలయంలో మూలన పడిన జనరేటర్‌లు

చినగంజాం: తహసీల్దార్ కార్యాలయాల్లో లక్షలు వెచ్చించి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కరెంటు జనరేటర్లు నిరుపయోగంగా మారాయి. గతంలో తహసీల్దార్ కార్యాలయంలో ల్యాండ్ రికార్డుల కంప్యూరీకరణ, నిరంతరం రెవెన్యూ సేవలు కొనసాగించేందుకు 2013లో రాష్ట్ర వ్యాప్తంగా తహసీల్దార్ కార్యాలయాలకు జనరేటర్లను అందించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 56 మండలాల్లో సైతం వీటిని ఏర్పాటు చేసి ల్యాండ్ రికార్డులను కంప్యూటరీకరణకు ఉపయోగించారు. ఆ తరువాత ప్రభుత్వాలు మారడంతో ల్యాండ్ రికార్డుల కంప్యూటరీ కరణ పనులు మూలనపడ్డాయి. అలాగే సదరు లక్ష్యానికి ఆటంకం లేకుండా ఉండేందుకు ఏర్పాటు చేసిన మండల కేంద్రంలోని జనరేటర్ల నిర్వహణ పూర్తిగా ఆగిపోయింది. గడచిన 10 సంవత్సరాలుగా తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కరెంటు జనరేటర్లు ఉపయోగంలో లేక పోవడంతో మూలన పడి శిథిలావస్థకు చేరే పరిస్థితి ఏర్పడింది.

ప్రజలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగినప్పుడు రెవెన్యూ సేవలకు అంతరాయం కలుగుతూనే ఉంది. మరమ్మతులు, నిర్వహణ భారం కావడంతో అధికారులు, సిబ్బంది జనరేటర్‌ల సంగతి పట్టించుకోవడం మానేశారు. ఇదే పరిస్థితి ఉమ్మడి జిల్లా మొత్తం కొనసాగుతోంది. కోస్తా జిల్లాల్లో ప్రకృతి వైపరీత్యాల సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగితే సేవలకు అవాంతరం కలుగ కూడదనే సంకల్పంతో ఏర్పాటు చేశారు. అలాగే తీరంలో తరచూ ఏర్పడే విపత్తులను ఎదుర్కొనేందుకు ప్రజలకు సకాలంలో సమాచారం అందజేసి వారికి అవసరమైన పునరావసం, ఆహార సదుపాయాలు కల్పించాల్సి ఉంటుంది. అందుకే తహసీల్దార్ కార్యాలయంలో విధులకు ఆటంకం కలగకుండా కూడా మరొకటి ఏర్పాటు చేశారు. ఇప్పటికైనా వాటికి మరమ్మతులు చేస్తే అందరికీ ఉపయోగపడుతాయి.

రసాభాసగా ఉపాధి గ్రామ సభలు



కొప్పరపాడులో వివరాలు తెలియజేస్తున్న గ్రామ కమిటీ

బల్లికురవ: వలసలు నిరోధించేందుకు ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకంలో అవినీతి చోటు చేసుకోవడం పరిపాటిగా మారింది. దీంతో గ్రామాల్లో జరుగుతున్న గ్రామ సభలు రసాభాసగా మారుతున్నాయి. శుక్రవారం కొప్పరపాడు గ్రామంలో 2024 – 25 ఆర్థిక సంవత్సరానికి సామాజిక తనిఖీ తదుపరి గ్రామ సచివాలయం వద్ద ఎస్ఆర్‌పీ కనకారావు ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. కూలీల మస్టర్‌లలో అవినీతి చోటుచేసుకున్నట్లు ఆరోపించారు. పశువులకు నీటి తొట్లు 5 నిర్మించినట్లుగా రికార్డులో చూపుతున్నారని 3 మాత్రమే నిర్మించారని అవి ఉపయోగ పడటం లేదని మన్యం ఆంజనేయులు, బోంతు మరియ బాబు, ముద్దపాటి అవినాష్, షేక్ మౌలాలి గ్రామ సభ దృష్టికి తెచ్చారు. మండలంలోని 21 గ్రామ పంచాయతీలో 12 కోట్లతో 645 పనులు పూర్తి చేసినట్లు రికార్డులో చూపుతున్నారు. ఎస్ఆర్‌పీలు గ్రామాల వారీగా జరిగిన పనులు పని ప్రదేశాలు కూలీలను ఇంటింటికి వెళ్లి విచారిస్తున్నారు. ఇప్పటికే కొత్తూరు, గొర్రెపాడు, కూకట్లపల్లి, గుంటుపల్లి, కొమ్మినేనివారిపాలెం, ముక్తేశ్వరం అంబడిపూడి, కొప్పరపాడు గ్రామాల్లో సామాజిక తనిఖీలు పూర్తయి గ్రామ సభలు నిర్వహించారు. ఈ గ్రామ సభలో రూ. 60 లక్షల పైగా అవినీతి అక్రమాలు ఉననట్లు తనిఖీ బృందాలు వెల్లడించాయి. ఆగస్టు 6వ తేదీ బల్లికురవలో జరిగే ప్రజావేదికలో అక్రమాలు పూర్తిస్థాయిలో వెలుగులోకి రానున్నాయి.

బాబు మోసాలను ఇంటింటికీ తిరిగి వివరిద్దాం



నాగండ్లలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు



సూదివారిపాలెంలో కరపత్రాలు పంచుతున్న నాయకులు, కార్యకర్తలు

ఇంకొల్లు(చినగంజాం): రాష్ట్ర ప్రజలను మాటలతో మాయచేసి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు విధానాలను, కూటమి ప్రభుత్వం తీరును ఇంటింటికి తిరిగి వివరిద్దామని బాపట్ల జిల్లా వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి బండారు ప్రభాకరరావు అన్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని నాగండ్ల, సూది వారిపాలెంలో మండల కన్వీనర్ చిన్ని పూర్ణారావు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ అనే కార్యక్రమాన్ని నియోజక వర్గ ఇన్‌చార్జ్ గాదె మధుసూదనరెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించారు. నాగండ్ల, సూదివారిపాలెం గ్రామాల్లో ముందుగా సమావేశాలను ఏర్పాటు చేసి గ్రామ నాయకులు, కార్యకర్తలకు అవగాహన కల్పించారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు అబద్ధపు హామీలను ఇచ్చి మోసగించిందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్న నెరవేర్చలేక పోయిందని వివరించారు. ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్ళి అందరికీ తెలియజేయాలని జిల్లా స్థాయి నాయకులన్నారు. అనంతరం రెండు గ్రామాల్లో ఇంటింటికి తిరిగి బాబు ష్యూరిటీ, మోసం గ్యారెంటీకి సంబంధించిన క్యూఆర్ కోడ్, కరపత్రాలను ప్రజలకు పంచి పెట్టి వారికి కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చిట్టిబాబు, ఇంటలక్చువల్ అధ్యక్షుడు భవనం హరేరామిరెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు నూతలపాటి బలరాం, కార్మిక విభాగం అధ్యక్షుడు తన్నీరు సూరిబాబు, మైనారిటీ సెల్ అయేషాబుడే, లతీఫ్, షంషుద్దీన్, గుంటూరు శ్రీనివాసరావు, కోటీ, శ్రీరాములు, గ్రామ నాయకులు వెంకటేశ్వరరాజు, సాదా, ఏసు , నరసింహం, హుస్సేన్ , పాలపర్తి శ్రీను,పూర్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ అత్యవసర సమావేశం

చీరాల: మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం శనివారం మధ్యాహ్నం 3 గంటలకు కౌన్సిల్ హాలులో నిర్వహించనున్నారు. చైర్మన్ మించాల సాంబశివరావు అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు కమిషనర్ అబ్దుల్ రషీద్ శుక్రవారం తెలిపారు. సమావేశానికి కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, అధికారులు విధిగా హాజరుకావాలని కోరారు.

పంటల బీమాకు ప్రీమియం చెల్లించండి

బల్లికురవ: ఖరీఫ్‌లో సాగుచేస్తున్న పంటలన్నింటికీ పంట నమోదుతో పంటల బీమాకు ప్రీమియం చెల్లించాలని వ్యవసాయాధికారి పి. శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. ఈ పంట నమోదుతో పంట ఉత్పత్తులను అమ్ముకొవచ్చని పంట బీమాతో విపత్కర పరిస్థితుల్లో పరిహారం పొందవచ్చని తెలిపారు. పత్తి, మినప, కంది, సాగుచేస్తున్న రైతులు జూలై 31 లోపు ప్రిమియం చెల్లించాలన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జరిమానా

అద్దంకి రూరల్: మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ముగ్గురిని సీఐ సుబ్బరాజు శుక్రవారం అద్దంకి కోర్టులో హాజరు పరిచారు. న్యాయమూర్తి జరిమాన, శిక్ష విధించినట్లు సీఐ తెలిపారు. వీరిలో తమిళనాడుకు చెందిన వ్యక్తికి రూ. 10 వేలు, మరో ఇద్దరికి రూ. 10 వేలు జరిమాన, శిక్ష విధించారన్నారు.

శింగరకొండ దర్శిని



ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం శ్రావణ మాసం ఆశ్లేష నక్షత్రం విదియ సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు శుక్రవారం తెలిపారు. క్షేత్ర ప్రాధాన్యం ఉన్న శనివారం ఆంజనేయ స్వామికి ఇష్టమైన ఆకు పూజ చేస్తే కోరిన కోర్కెలు నెరవరుతాయని చెప్పారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు శ్రీసువర్చలా సహిత దక్షిణాభిముఖ ప్రసన్నంజనేయ స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

ఆడబిడ్డ నిధి పథకానికి మంగళం



కల్లంవారిపాలెం వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడిని అభినందిస్తున్న మండల కన్వీనర్

జె.పంగులూరు: ఎన్నికలకు ముందు ఆడబిడ్డ నిధి అంటూ మహిళలను ఆశపెట్టి నేడు ఆ పథకానికి మంగళం పాడేందుకు చంద్రబాబు నేతృత్వంలోని కూటమి సర్కార్ సిద్ధమైందని మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ రావూరి శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధిలోని కల్లవారిపాలెంలో శుక్రవారం నూతన గ్రామ కమిటీలు ఏర్పాటు కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ రావూరి శ్రీనివాసరావు మాట్లాడారు. మంత్రి అచ్చం నాయుడు ఆడబిడ్డ నిధి పథకాన్ని ఎత్తివేస్తున్నామంటూ వారిని మానసికంగా సిద్ధం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కూటమి సర్కార్ ఏర్పాటు ఏడాది గడిచిన సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకపోగా ఒక్కో పథకాన్ని ఎత్తివేసే కుట్రలు చేస్తున్నారన్నారు.

పార్టీని బలోపేతం చేద్దాం

గ్రామాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన కమిటీలు సమన్వయంతో వ్యవహరించి పార్టీని మరింత బలోపేతం చేయాలని కన్వీనర్ రావూరి శ్రీనివాసరావు అన్నారు. అనంతరం వైఎస్సార్ సీపీ నూతన అధ్యక్షునిగా ఎన్నుకున్న భద్రిరెడ్డికి మండల కన్వీనర్ రావూరి శ్రీనివాసరావు అభినందించారు. కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పొగాకు కొనుగోలు కేంద్రం ప్రారంభం



అద్దంకిలో పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన తహసీల్దార్ సింగారావు

జె.పంగులూరు: మండల పరిధిలోని పంగులూరు మార్కెట్ యార్డు, తూర్పు కొప్పెరపాడు సొసైటీ గూడేలు పొగాకు చెక్కులతో పూర్తిగా నిండిపోయినట్లు తహసీల్దార్ పి. సింగారావు తెలిపారు. మండలంలో ఇంకా గోడౌన్లు లేకపోవడంతో శుక్రవారం నుంచి అద్దంకి ఏఎంసీ భవనాల్లో పంగులూరు మండలంలోని నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనట్లు తహసీల్దార్ పి. సింగారావు తెలిపారు. గత నెల 30వ తేదీ నుంచి ప్రారంభం అయిన పొగాకు కొనుగోలు కేంద్రం ఈ నెల 24వ తేదీతో కొనుగోలు కేంద్రాన్ని మండలంలో ఆపినట్లు తెలిపారు. శుక్రవారం నుంచి మండలంలోని రైతులు అద్దంకి మార్కెట్ యార్డులో పొగాకు చెక్కులు తీసుకుపోవాలని తహసీల్దార్ పి. సింగారావు తెలిపారు. మండలంలో ఇప్పటి వరకు కొనుగోలు చేసిన పొగాకు కొనుగోలు కేంద్రంలో హెచ్‌డీఆర్ (మొదటి రకం) రూ. 12 వేలు చొప్పున 467 చెక్కులకు గాను 428.33 క్వింటాకు రూ. 50,06,560 రైతులకు డబ్బులు చెల్లించాల్సి ఉంది. అదే విధంగా హెచ్‌డీఎం (రెండో రకం) రూ. 9 వేలు చొప్పున 1239 చెక్కులకు గాను 1087.48 క్వింటాకు రూ. 97,87,320, హెచ్‌డీఎక్స్ (మూడో రకం) 1570 చెక్కులకు గాను 1178.40 క్వింటా రూ.70,70,160 డబ్బులు రైతుల ధర పలికించినట్లు తెలిపారు. ఈ డబ్బులు త్వరలో రైతుల ఖాతాలోకి జమఅవుతాయిన తెలిపారు.

శాస్త్రీయ పరిజ్ఞానంతో ఉన్నత భవిత



మాట్లాడుతున్న సాధిక్

వేటపాలెం: విద్యార్థులు శాస్త్రీయ పరిజ్ఞానాన్ని పెంపొందించు కోవాలని జిల్లా సైన్స్ అధికారి మహమ్మద్ సాధిక్ పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలి కొన్నత పాఠశాలలోని సైన్స్ ల్యాబ్‌ను శుక్రవారం పరిశీలించారు. సైన్స్ ల్యాబ్‌లో విద్యార్థులతో ప్రయోగాలు చేయించాలన్నారు. 2025–26 సైన్స్ ఫేర్ నామినేషన్స్‌పై ఉపాధ్యాయలకు సూచనలు, సలహాలు ఇచ్చారు. అలాగే సైన్స్ సెమినార్ ఎగ్జిబిషన్ గురించి చర్చించారు. తక్కువ వ్యయంతో సైన్స్ ప్రయోగాలు ఎలా చేయాలో విద్యార్థులకు వివరించారు. ప్లాస్టిక్ నిషేధంలో ఉందని.. సింగిల ప్లాస్టిక్‌ను ఉపయోగించకుండా.. గుడ్డ సంచులను వాడాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దేవరకొండ సరోజిని, కె. సోమశేఖర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి



విద్యుత్ తీగలు తగిలి మృతి చెందిన గేదెలు

మార్టూరు: విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యం వలన మార్టూరు మండలం నాగరాజు పల్లి గ్రామంలో ఓ రైతుకు చెందిన రెండు గేదెలు శుక్రవారం సాయంత్రం మృతి చెందాయి. లైన్ మేన్ వేణు, స్థానికుల వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రైతు సోమల నాగేశ్వరరావుకు చెందిన రెండు గేదెలు దక్షిణం వైపు పొలాల్లో మేతకు వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగి వస్తున్నాయి. ఈ క్రమంలో గ్రామ సమీపంలో వేళ్లాడుతున్న విద్యుత్ తీగలు తగిలి రెండు మూగజీవాలు అక్కడికక్కడే మృతి చెందాయి. సుమారు 3 లక్షల రూపాయల విలువైన రెండు గేదెలు కళేబరాలుగా మారడంతో రైతు కుటుంబం ఆవేదన వ్యక్తం చేసింది. ఈ విషయమై లైన్‌మేన్‌ను వివరాలు అడగ్గా శుక్రవారం గ్రామంలో విద్యుత్ మరమ్మతులు చేస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా వేరేచోట నేల జారిన వైర్లను బిగిస్తున్న క్రమంలో గేదెలు వచ్చే మార్గంలో తీగలు కిందకి జారిన విషయం తాము గమనించలేదన్నారు. మరమ్మత్తుల అనంతరం విద్యుత్ ప్రసారాన్ని వదలడంతో గేదెలు మృతి చెందినట్లు తెలిపాడు. విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యం వలన తమకు జరిగిన నష్టాన్ని భర్తీ చేయాలని రైతు కుటుంబం కోరుతోంది. ఇదిలా ఉండగా విద్యుత్ శాఖ ఏఈ కిరణ్ విలేకరులతో శుక్రవారం రాత్రి మాట్లాడారు. నాగరాజు పల్లి గ్రామంలో శుక్రవారం సిబ్బంది మరమ్మతులు నిర్వహించింది గ్రానైట్ పరిశ్రమలకు సంబంధించిన హై టెన్షన్ లైన్ కోసమన్నారు. విద్యుత్ తీగ తగిలి మృతి చెందిన వైరు గ్రామంలోకి విద్యుత్ సరఫరా చేసే ఎల్టి లైన్ అని.. ఆ తీగ ప్రమాదవశాత్తు తెగిపడిందని తెలిపారు.

దర్శిలో సినిమా షూటింగ్



సినిమా షూటింగ్‌లో నటీనటులు

దర్శి: పట్టణంలోని కనకదుర్గమ్మ తల్లి ఆలయంలో ×దక్షణ కాళీ× అనే సినిమా షూటింగ్ శుక్రవారం జరిగింది. శ్రీనిధి క్రియేషన్స్ నిర్మాత వాణి మీసాల మాట్లాడుతూ ఈ ప్రాంతంలో 15 రోజుల పాటు షూటింగ్ ఉంటుందన్నారు. ఆ తర్వాత గోకర్ణం, మైసూరు ప్రాంతాల్లో షూటింగ్ జరుగుతుందని తెలిపారు. ప్రధానంగా భక్తి పూర్వకంగా సినిమా నడుస్తుందని చెప్పారు. సినిమాకు డైరెక్టర్‌గా తోట కృష్ణ వ్యవహరిస్తున్నారు. హీరోగా యూట్యూబర్ సుబ్బు, హీరోయిన్‌గా ప్రియాక, కాళీ అమ్మవారి అవతారంలో అర్చన, జబర్దస్తు ఫేమ్ కెవ్వు కార్తీక్ తదితరులు సినిమాలో నటిస్తున్నారు. దర్శిలో సినిమా షూటింగ్‌కు చుట్టుపక్కల ప్రాంతాలను పరిచయం చేస్తున్న గణేష్ హనుమంతరావుకు స్థానికులు అభినందనలు తెలిపారు.



శాకంబరిగా కనకదుర్గమ్మ తల్లి దర్శనం



అమ్మవారికి గుమ్మడికాయలు, నిమ్మకాయలతో పూజలు

ఘనంగా శాకంబరి ఉత్సవాలు

- కనకదుర్గమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

దర్శి: రెండు రోజులుగా శాకంబరి అమ్మవారి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారిని కూరగాయలతో అందంగా అలంకరించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కుంకుమ పూజలు చేశారు. హాజరైన భక్తులకు అన్నదానం చేశారు.



కుంకుమ పూజకు హాజరైన భక్తులు

డ్రోన్లతో నిఘా



డ్రోన్ కెమెరాలో క్లిక్ మన్న పట్టణ ప్రాంతంలో ఓ భాగం

అద్దంకి: పెరుగుతున్న నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు ఆధునిక టెక్నాలజీ వాడుతున్నారు. నేర నితయంత్రణలో భాగంగా సీఐ సుబ్బరావు ఆధ్వర్యంలో డ్రోన్ కెమెరాను వాడుతున్నారు. రద్దీగా ఉన్న ప్రదేశాలు, బ్యాంకులు, బస్టాండ్‌లు, ఖాళీ ఉన్న పట్టణ శివారు ప్రాంతాల్లో డ్రోన్‌ను ఉపయోగించి ఆయా ప్రదేశాల్లో నేరస్తుల ఉనికిని, పేకాట శిబిరాలు, కోడి పందేలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిని గుర్తించనున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే దొరికిపోతారని సీఐ హెచ్చరించారు.

సైన్స్, బోటనీపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్ సావిత్రి ఆధ్వర్యంలో జరిగిన కెరీర్ ఆపర్చునిటీస్ కార్యక్రమానికి తెలంగాణ స్టేట్ సర్వీసెస్ అసిస్టెంట్ డైరెక్టర్ హర్ష భార్గవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సైన్స్ మరియు ఆర్ట్స్ గ్రూపుల్లో ఉన్న బిగ్ డేటా, బోటనీ విభాగంలో మొక్కల్లో ఉన్న ఔషధ గుణాలపై అవగాహన కల్పించారు. స్వయం ఉపాధిలో ఉన్న ప్రభుత్వ సహకారాన్ని వివరించారు. అధ్యాపకులు శ్రీనివాసాచారి, విజయబాబు పాల్గొన్నారు.